క్లుప్తంగా

నేటి నుంచి విద్యుత్ మరమ్మతులు

పెదకూరపాడు : పెదకూరపాడు మండల పరిధిలోని గారపాడు, హుస్సేన్‌నగరం, రామాపురం, బుచ్చయ్యపాలెం, సత్తెనపల్లి మండల పరిధిలోని గుజ్జర్లపూడి గ్రామాల్లో బుధవారం నుంచి ఆదివారం వరకు విద్యుత్ మరమ్మతుల పనులు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఐదు రోజులపాటు ఆయా గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా మరమ్మతులు జరుగుతున్నాయని ఆయన తెలియజేశారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఆంధ్ర ఫుట్‌బాల్ జట్టుకు మాదల విద్యార్థిని



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థిని పెండెం ప్రవల్లిక ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలలో ఆంధ్ర రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ రమేష్ మంగళవారం తెలిపారు. 14 సంవత్సరాలలోపు బాలికల ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొనేందుకు ఎంపికయిందన్నారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 24 నుంచి 29 వరకు జరిగే జాతీయ ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొనాల్సి ఉందన్నారు. పోటీలకు ఎంపిక కాబడిన పెండెం ప్రవల్లికను, ప్రోత్సహిస్తున్న తండ్రి హరిబాబును పాఠశాల పీడీ సత్యవతి, బోధనా సిబ్బంది అభినందించారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ముప్పాళ్ళ: మండలంలోని రుద్రవరం గ్రామంలో గజ్జల నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో, జీబీఆర్ హాస్పిటల్ నరసరావుపేట వారిచే ఈ నెల 23వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం జరుగుతుందని ట్రస్ట్ సభ్యులు మంగళవారం తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద జరిగే ఈ శిబిరంలో ఎముకలు, కీళ్లు, గుండె, థైరాయిడ్, బీపీ, షుగర్, కళ్లు తిరగటం, వాంతులు వంటి వాటికి పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాదలలో 'పోషణ్ పక్వాడా'



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఇరుకుపాలెం సెక్టార్ పరిధిలో పోషణ్ పక్వాడా కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో ప్రాజెక్ట్ సీడీపీఓ టీ శ్రీలత పాల్గొని బాడీమాస్ ఇన్‌డెక్స్ గురించి అవగాహన కల్పించారు. ఏసీడీపీఓ టీ సంతోషకుమారి మునగ ఆకు వలన కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు వివరించారు. చిరు ధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలు తినడం వలన కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జీ జయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



దాచేపల్లి: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించే వినూత్న కార్యక్రమానికి కాట్రపాడు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు. ప్రధానోపాధ్యాయుడు సంపత్‌కుమార్ పర్యవేక్షణలో ఉపాధ్యాయులు కాట్రపాడు, భట్రుపాలెం గ్రామాల్లో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. కాట్రపాడు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న విద్యాబోధన, వసతుల గురించి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. 12 మంది విద్యార్థులను బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులతో ఆడ్మిషన్ రాయించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామని, మనబడి వ్యవస్థాపకులు రవీంద్రరాజు, సభ్యుల సహకారంతో పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించామని హెచ్‌ఎం సంపత్‌కుమార్ చెప్పారు. కాట్రపాడు ప్రభుత్వ పాఠశాలని ఆదర్శ పాఠశాలగా ఎంపిక కావటం వలన ఐదుగురు ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నామని, పాఠశాల ప్రగతికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఆదర్శ పాఠశాల ప్రవేశాల ద్వారా ఎక్కువగా సీట్లు తమ విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షీబా, లక్ష్మీకోటేశ్వరరావు, ఆళ్లగడ్డ త్రివేణి పాల్గొన్నారు.

నిలువ నీడ లేక అవస్థలు

బస్ షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్న దొడ్లేరు ప్రజలు

- గ్రామ జనాభాతో పాటు చుట్టుపక్కల 10 గ్రామాల ప్రజల రాకపోకలు
- నిత్యం పిడుగురాళ్ల–క్రోసూరు, సత్తెనపల్లి–దొడ్లేరు బస్సులతో రద్దీ
- గత ప్రభుత్వంలో డబుల్ రోడ్డుగా విస్తరణ
- గ్రామంలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రయాణికులు

క్రోసూరు మండలంలోనే అది పెద్ద పంచాయతీ గ్రామాలలో ఒకటి. నిత్యం అనేక మంది వివిధ పనుల నిమిత్తం బస్సులపై ఆధారపడి ప్రయాణాలు సాగిస్తుంటారు. కానీ వారు బస్సుల కోసం వేచి ఉండేందుకు నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి కాలం కావడంతో ఆ అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని వాపోతున్నారు. ఇది దొడ్లేరు గ్రామ ప్రజల పరిస్థితి. గ్రామంలో కనీసం నిలుచునేందుకు బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



పిడుగురాళ్ల వెళ్లే బస్సు ఎక్కేందుకు వెళ్తున్న ప్రయాణికులు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామం 10 వేల జనాభా కలిగిన రెండవ పెద్ద పంచాయతీ గ్రామం. దీనికి తోడు చుట్టుపక్కల సుమారు పది గ్రామాల ప్రజలు దొడ్లేరుకు, దొడ్లేరు మీదగా ఇతర గ్రామాలకు వెళ్తుంటారు. నిత్యం వచ్చిపోయే బస్సులతో, ప్రయాణికులతో రద్దీగా ఉండే దొడ్లేరులో ప్రయాణికులు కూర్చోవడం మాట దేవుడెరుగు కనీసం నిలబడటానికి కూడా సరైన సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రోడ్డు పక్కనే బస్సుల కోసం నిలబడుతున్నారు. బస్ షెల్టర్ లేకపోవటంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పడటంతో దుకాణాల ఎదురుగా వ్యాపారుస్తులు నిలబడనీయటం లేదని పలువురు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గ్రామానికి డబుల్ రోడ్డు వేయించటంతో రోడ్డు విశాలమైంది.

రాకపోకలు ఇలా...

గ్రామానికి పిడుగురాళ్ల నుంచి క్రోసూరుకు, అలాగే క్రోసూరు నుంచి పిడుగురాళ్లకు దొడ్లేరు మీదగా ప్రతి గంటకు ఆర్టీసీ బస్సుల రాకపోకలు జరుగుతుంటాయి.

- పిడుగురాళ్ల నుంచి క్రోసూరు మధ్యలో బెల్లంకొండ, చంద్రాజుపాలెం, ఆవులవారిపాలెం, దొడ్లేరు అనంతవరం, గ్రామాలున్నాయి. ఈ గ్రామాల ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం ప్రయాణిస్తుంటారు.



దొడ్లేరు గ్రామ ప్రధాన రహదారి

అలాగే దొడ్లేరులో జెడ్పీ పాఠశాల, ఎంపీపీ పాఠశాల, పలు ప్రైవేటు పాఠశాలలు ఉండటంతో పలువురు విద్యార్థులు వస్తుంటారు.

- అదే విధంగా సత్తెనపల్లి నుంచి రెడ్డిగూడెం, నాగవరం, హసనాబాద్ మీదగా దొడ్లేరుకు ఆర్టీసీ బస్సుల రాకపోకలు జరుగుతుంటాయి. సత్తెనపల్లిలో కాలేజీకి వెళ్లే విద్యార్థులు, వ్యాపారం, ఇతర పనుల నిమిత్తం, ఆసుపత్రులకు వెళ్లేందుకు ప్రయాణికులు నిత్యం బస్సుల కోసం రోడ్డుకు చేరుకోవాల్సిందే.
- అయితే గ్రామంలో ఎక్కడా బస్సుల కోసం నిలుచునేందుకు షెల్టర్ లేకపోవటంతో ప్రయాణికులు, మహిళలు, విద్యార్థినులు, అవస్థలు పడుతున్నారు.
- వర్షాకాలం, ఎండాకాలంలో ఎక్కడా నిలుచునేందుకు అవకాశం లేకపోవడంతో దుకాణాల్లో, హోటళ్ల వద్ద తలదాచుకోవాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, పిడుగురాళ్ల డిపో అధికారులు, దాతలు స్పందించి గ్రామంలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మీద నిలబడాల్సి వస్తుంది



విద్యార్థులు, పెద్దలు బస్సులు వచ్చే సమయానికి సెంటర్‌కు వచ్చినా బస్సు వచ్చే వరకు రోడ్డు మీద నిలబడాల్సి వస్తుంది. లేదంటే దుకాణాల వద్ద నిలబడాల్సి వస్తుంది. చాల ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు జోక్యం చేసుకుని బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి.

– పోసిపోగు ఋషి, విద్యార్థి, దొడ్లేరు

ఎండాకాలం, వర్షాకాలం మరింత ఇబ్బంది



నేను తొమ్మిదవ తరగతి చదువుతున్నాను. మా బస్సు వచ్చే వరకు రోడ్డు మీద నిలబడాలంటే చాలా కష్టం. అదే సమయంలో వర్షం వస్తే మరింత ఇబ్బంది. బస్ షెల్టర్ ఉంటే బస్సు వచ్చే వరకు అందులో ఉండేందుకు అవకాశం ఉంటుంది.

– కొండపల్లి భార్గవ్, 9వ తరగతి, దొడ్లేరు

నీడలేదు, తావులేదు



ఊళ్లకు వెళ్లేందుకు బస్సుల కోసం రోడ్డు మీద నిలబడాల్సిందే. నిలబడేందుకు నీడ లేదు, తావులేదు. మహిళలు, వృద్ధుల పరిస్థితి చాల కష్టంగా ఉంది. అధికారులు పట్టించుకొని బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి.

– సీతమ్మ, దొడ్లేరు

ప్రభుత్వ శాఖల పనితీరుపై మండిపడ్డ ప్రజా ప్రతినిధులు

మండల పరిషత్ సమావేశంలో వివిధ శాఖలపై అసంతృప్తి వ్యక్తపరచిన సభ్యులు

అచ్చంపేట: వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మభాయి అధ్యక్షతన సమావేశం జరిగింది. వివిధ శాఖల పురోగతిపై చర్చించారు.

- శాఖ అధికారులు ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు జవాబుదారీగా ఉండటం లేదని సభ్యులు మండిపడ్డారు. దొంగలించబడిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ స్థానంలో ఇంతవరకు కొత్తవి బిగించలేదని, రైతులు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాదిపాడు ఎంపీటీసీ, ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మభాయ్‌ని ప్రశ్నించారు.
- వేల్పూరు పంచాయతీ పరిధిలోని ఇళ్లకు క్రోసూరు మండల విద్యుత్ అధికారులు విద్యుత్ కనెక్షన్లు ఎందుకు ఇస్తున్నారంటూ వేల్పూరు సర్పంచ్ జువ్వా శంకర్ ప్రశ్నించారు.



సభ ముందు ప్రగతి నివేదిక ఉంచుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు

- విద్యుత్ కనెక్షన్ల కోసం చాలా నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు కనీసం విద్యుత్ స్తంభాలు కూడా వేయలేదని తాళ్లచెరువు ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు.
- ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో వచ్చిన సమస్యలను ఇంతవరకు ఎందుకు పరిష్కరించలేదని నీటి సంఘం అధ్యక్షుడు పసుపులేటి పాపిరెడ్డి ప్రశ్నించారు.
- వేసవిలో మంచినీళ్లు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ సాగదీత ధోరణి అవలంబిస్తోందని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు సభ ముందుకు తెచ్చారు. తక్షణమే బోర్లు మరమ్మతులు చేయించి నీటి ఎద్దడిని నివారించాలని కోరారు.
- పులిచింతల ప్రాజెక్టు వరకు ఆర్టీసీ బస్సులు నడిపాలని సభ్యులు కోరారు.

వేసవిలో బాల్యవివాహాలు ఎక్కువగా జరిగే అవకాశాలున్నందున వాటిని నివారించేందుకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కోరారు.

- గైర్హాజరైన అధికారులకు మెమోలివ్వాలని ఎంపీపీ స్వర్ణమ్మభాయి ఎంపీడీవో శ్రీనివాసరావుకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు, ఉప ఎంపీపీలు తెల్లపాటి నాగరాజు, గంగసాని నరసింహారెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లెల్లో మోటార్ దొంగలు

- నేల బావి మోటార్లే లక్ష్యంగా చోరీలు
- భయాందోళనలో గ్రామస్తులు

పెదకూరపాడు : గ్రామీణ ప్రాంతాల్లో నీటి మోటార్ల దొంగలు నేల బావిల మీద మోటార్లే లక్ష్యంగా చోరీలకు తెగబడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గత వారం రోజుల నుంచి మోటార్ల దొంగలు రాత్రివేళ హల్‌చల్ చేస్తున్నారు. నీటి అవసరాల కోసం గ్రామీణ ప్రాంతాల్లో నేలబావిల వద్ద మోటార్లు ఏర్పాటు చేసుకొని అవసరాలు తీర్చుకుంటున్న ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన ఎలాంటి పురోగతి లేక పోవడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదకూరపాడు ఎస్సీ కాలనీలోని ఆర్‌సీఎం పాఠశాల వద్ద నేల బావి ఉంది. చుట్టుపక్కల ప్రజానీకం ఆ బావి చుట్టూ మోటార్లు పెట్టుకొని నీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. గత వారం రోజులలో 5 మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఇవేకాక గ్రామంలో పలు ప్రాంతాల్లో మోటార్లు పెద్ద ఎత్తున దొంగతనానికి గురయ్యాయి. దొంగతనాలు జరుగుతున్న పట్టించుకునే నాథుడే లేరంటూ బాధితుల ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై గిరిబాబుకు ఫిర్యాదు చేసినట్టు బాధితులు తెలిపారు.



పైపులను కట్ చేసి మోటార్ చోరీ చేసిన దృశ్యం

నేడు ఆలయ భూముల వేలం

రెంటచింతల: మండలంలోని తుమ్మకోటలోని జనార్దనస్వామి ఆలయం భూముల వేలం బుధవారం దేవస్థానం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానానికి కాట్రేటి డొంకలో 9.84 ఎకరాలు, తాటిచెట్ల మాన్యం 7.40 ఎకరాలు, గన్నవరం బ్రిడ్జి దగ్గర 15 ఎకరాల మాగాణి భూములు ఉన్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొని పాడుకున్న వారికి 2025– 2026 నుంచి 2027–2028 వరకు మూడేళ్ల పాటు కౌలు హక్కు ఉంటుందని చెప్పారు. మొత్తం 32.24 ఎకరాల భూమికి జరిగే ఈ వేలం పాటలో పాల్గొనే వారు రూ.5 వేలు ప్రథమ ధారావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు. కౌలు హక్కు పొందిన వారు ముందుగానే ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలాఖరులో చెల్లించి భూమిలో ప్రవేశించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఈ బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

ఎస్ఈ విజయకుమార్

మాచర్ల: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ డాక్టర్ టి.విజయకుమార్ తెలిపారు. పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయంలో ఈఈ ఎస్.సింగయ్య సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ ఎలాంటి లోపాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఉద్యోగులు, అధికారులు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు వస్తే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. మాచర్ల డివిజనల్ విద్యుత్ శాఖను జిల్లాలో ఉత్తమ శాఖగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. విద్యుత్ రెవెన్యూ కలెక్షన్ పెండింగ్ బకాయిలు వెంటనే వసూలు చేయాలని కోరారు. వినియోగదారులకు అవగాహన కల్పించి బకాయిలు ఉంటే వసూలకు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నెలాఖరులో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పెండింగ్ బకాయిలు వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామయ్య, అకౌంట్స్ అసిస్టెంట్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఏఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ విజయకుమార్

ఘనంగా శ్రీనివాస కల్యాణం



మాచర్ల: పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ అర్చకులు అడిగొప్పల చెన్నకేశవాచార్యులు, దేవాలయ నిర్వాహకులు బోయరామిరెడ్డి, బందా వెంకటేశ్వర్లు, నర్సయ్య, రాధా, రమణారెడ్డి, కల్యాణ కమిటీ సభ్యులు, కొత్తమాను బ్రహ్మారావు, ఆత్మకూరి పూర్ణచంద్రరావుతో పాటు, పలువురు దంపతులు పీటలపై కూర్చున్నారు. ఉదయం 10 గంటలకు స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాల అనంతరం కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హోమంలో వందలాది మంది భక్తులు పాల్గొని హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

సివిల్ సర్వీసెస్ ర్యాంకర్ ప్రత్యూష్‌కు సత్కారం



ప్రత్యూష్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్–2024 సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 797వ ర్యాంకు సాధించిన పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన పెండెం ప్రత్యూష్‌ను మంగళవారం పలువురు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 797వ ర్యాంక్ సాధించడం గొప్ప విషయమన్నారు. ఐపీఎస్‌కు ఎంపికైన ప్రత్యూష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కుమారుడిని ఉన్నత స్థాయికి తీర్చిదిద్దిన తల్లిదండ్రులు పెండెం బాబురావు, పద్మలను అభినందించారు. ఈ సందర్భంగా పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఏపీపీ బగ్గి నరసింహారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు చిన్నం మణిబాబు, న్యాయవాదులు చిట్టా విజయ్ భాస్కర్ రెడ్డి, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, సూరే వీరయ్య, రాజవరపు శివనాగేశ్వరరావు, కోటగిరి లక్ష్మణ్, బగ్గి పవన్ కుమార్, శెట్టి ఆనంద్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, పలువురు అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



నార్నెపాడులో ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న పీడీ సిద్దలింగమూర్తి

ముప్పాళ్ళ: జాబ్ కార్డు ఉన్న అందరికీ పని కల్పించాలని డ్వామా పీడీ ఎం.సిద్దలింగమూర్తి చెప్పారు. మండలంలోని నార్నెపాడు, కుందురువారిపాలెం, లంకెలకూరపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అన్ని గ్రామాల్లోను సేద్యపు కుంటల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. మండలంలో 140 ఇంకుడు గుంతలకు గాను ఇప్పటివరకు 90 పూర్తయ్యాయని, మిగిలిన నిర్మాణ పనులు కూడా పూర్తి చేయాలన్నారు. వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని పని జరిగే ప్రాంతంలో నీడ, మెడికల్ కిట్లు, తాగునీరు, వసతి ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏపీడీ వెంకటనారాయణ, ఏపీడీ ఏడుకొండలు, ఆయా గ్రామాల ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లు

సబ్ రిజిస్ట్రార్ ఎం.విజయప్రసాదరావు



క్రోసూరు: ఈ నెల 26వ తేదీ నుంచి క్రోసూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు స్లాట్ బుకింగ్ ద్వారా జరుగుతాయని సబ్ రిజిస్ట్రార్ ఎం.విజయప్రసాదరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు స్లాట్ బుకింగ్ ద్వారా చేసుకోవాలని కోరారు. స్లాట్ బుకింగ్‌లో కేటాయించిన సమయంలోపు ఇరు పార్టీలు(కొనుగోలుదారులు, విక్రయదారులు) కార్యాలయానికి రావాలన్నారు. ఈ సదుపాయం వలన కొనుగోలుదారులు తాము కోరుకున్న సమయంలో ఎటువంటి ఆలస్యం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవటానికి, ఎక్కువ సమయం వేచి ఉండకుండా, రిజిస్ట్రేషన్ ప్రక్రియ 10 నుంచి 15 నిమిషాలలో పూర్తి చేసుకోవచ్చని వివరించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పడిగాపులు కాయకుండా కేటాయించిన సమయానికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం ఈ సదుపాయాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. క్రయవిక్రయదారుల సెల్‌ఫోన్‌లో ఓటీపీ వస్తుందని, అది చెప్పిన తరువాతనే రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తామని చెప్పారు. రోజుకు 39 దస్తావేజులకు అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. స్లాట్ బుకింగ్‌పై అవగాహన కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పదవులు పొందిన వారిని సత్కరించడం సంప్రదాయం

ప్రొఫెసర్ వెలుగూరి సుబ్బారాయుడు

సత్తెనపల్లి: ప్రభుత్వ పదవులు పొందిన వారిని సత్కరించి గౌరవించే సంప్రదాయం మంచి పరిణామమని ప్రొఫెసర్ వెలుగూరి సుబ్బారాయుడు అన్నారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని రాఘవేంద్ర బాలకుటీర్ పాఠశాలలో మంగళవారం సొసైటీలో కమిటీ సభ్యులైన ఇరువురు ఇటీవల ప్రభుత్వంలో పదవులు పొందడంతో వారికి చిరు సత్కారం చేశారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడిగా జవ్వాజి రామ్మోహన్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పోతుగంటి రామకోటేశ్వరరావు నియమితులు కావడంతో వారిరువురిని పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు త్రిపుర మల్లు నాగమల్లేశ్వరరావు, శిఖాకొలను రమణ, ఏలూరి పద్మాకర మురళీకృష్ణ, దివ్వెల శ్రీనివాసరావు, తవ్వా హరనాథ్, రాఘవేంద్ర బాలకుటీర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీతాంజలి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెలుగూరి సుబ్బారాయుడు

సాంఘిక బహిష్కరణపై కేసు నమోదు చేయాలి

వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్

సత్తెనపల్లి: కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో దళితులను సాంఘిక బహిష్కరణకు గురిచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం వివిధ ప్రజా సంఘాల నాయకులు నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పలువురు మాట్లాడారు. సాక్షాత్తు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలోనే ఇటువంటి ఘటన చోటు చేసుకోవడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. విద్యుత్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన పల్లపు సురేష్ కుటుంబానికి ఆర్థిక సహాయం, అండదండలు అందించాల్సింది పోయి దళిత సామాజిక వర్గం మొత్తాన్ని సాంఘిక బహిష్కరణకు గురి చేయటం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇంత జరిగినా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలాంజనేయస్వామి, హోం మంత్రి అనిత కనీసం ఖండించటం, నియోజవర్గంలో పర్యటించటం చేయలేదని వాపోయారు. బాధ్యులపై కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దాసరి జ్ఞానరాజు పాల్, కొరబండి ఆంథోని, జొన్నలగడ్డ విజయ్ కుమార్, కోడిరెక్క దేవదాస్, పెద్దింటి నాగేశ్వరరావు, పోతుల సంగీతరావు, గుంటూరు మాణిక్యరావు ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి



మాచర్ల: రామకృష్ణా సేవాసమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఆశ్రమంలో ఉచిత యోగ, ఏపీఆర్‌జేసీ, స్పోకెన్ ఇంగ్లిష్, పాలిటెక్నిక్, కంప్యూటర్స్ తదితర కోర్సుల్లో శిక్షణ తరగతులు ప్రారంభించారు. నిర్వాహకుడు మెట్టు గోవిందారెడ్డి మాట్లాడుతూ శిక్షణ తరగతులు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 9440006813 నంబరులో సంప్రదించాలని కోరారు.